క్లుప్తంగా

వాహనాల తనిఖీలు



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

గంగవరం: మండలంలోని కొత్తపల్లి – గంగవరం ప్రధాన రహదారిలో భయ్యనపల్లి జంక్షన్ వద్ద ఎస్‌ఐ వెంకటేష్‌న్ బుధవారం వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు వాహనాలు నడిపే సమయంలో తగిన జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. వాహన పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. లైసెన్స్‌లు లేకుండా వాహనాలు నడిపినా, రోడ్డు భద్రత నింబంధనలు ఉల్లంఘించినా జరిమానాలు విధిస్తామన్నారు.

చింతపల్లి డీటీగా నరేంద్ర



చింతపల్లి: చింతపల్లి మండల డిప్యూటీ తహసీల్దారుగా ఎస్.నరేంద్ర నియమితులయ్యారు. ప్రభుత్వం బదిలీల్లో భాగంగా ఇక్కడ విదులు నిర్వహిస్తున్న డీటీ చంద్రశేఖర్‌కు బదిలీ కావడంతో దుంబ్రిగుడలో విధులు నిర్వహిస్తున్న నరేంద్రను చింతపల్లికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం బాధ్యతలు స్వీకరించారు.

పశువుల వ్యాన్ సీజ్



పోలీసులు సీజ్ చేసిన వ్యాన్

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి స్టేషన్ పరిధిలోని కింద్ర జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా బుధవారం పశువులతో వెళ్తున్న వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు. ఈ సంఘటనలో ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామన్నారు. వీరంతా మండలంలోని దూసరపాము గ్రామానికి చెందిన వారుగా ఆయన చెప్పారు. వీరిపై కేసు నమోదు చేసి పశువులతో సహ వ్యాన్‌ను సీజ్ చేసినట్టు ఎస్‌ఐ నరసింహమూర్తి తెలిపారు.

సకాలంలో రేషన్ పంపిణీ




సిబ్బందికి సూచనలిస్తున్న తహసీల్దార్ అన్నాజీరావు

గూడెం కొత్తవీధి: పేదలకు పంపిణీ చేసే నిత్యావసర వస్తువులను సకాలంలో పంపిణీ చేయాలని తహసీల్దార్ హెచ్.అన్నాజీరావు అన్నారు. కార్యాలయంలో రేషన్ డీలర్లుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా డిపోలను తెరిచి కార్డుదారులకు రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. 65 సంవత్సరాలు దాటిన వారికి ఇంటి వద్దకే రేషన్ అందించాలన్నారు. కార్డుదారులకు ఈకేవైసీ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. డీటీ కె.సీతారాం, ఆర్ఐ బాలమజ్జి తదితరులు పాల్గొన్నారు.

26న మండల సమావేశం

రంపచోడవరం: రంపచోడవరం మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 26న ఎంపీపీ బంధం శ్రీదేవి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు హాజరు కావాలన్నారు. మండలస్థాయి అధికారులు శాఖాపరమైన ప్రగతి నివేదికలు ముందుగానే కార్యాలయానికి అందజేయాలన్నారు. అలాగే అధికారులు విధిగా సమావేశానికి హాజరు కావాలన్నారు.

పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణం వేగవంతం



పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీడీవో పూర్ణయ్య, ఏఈ కృష్ణారావు తదితరులు

పెదబయలు: మండలంలోని పీఎం జన్‌మన్ గృహాలు మంజూరైన లబ్ధిదారులు వేగవంతంగా నిర్మాణం చేసుకుంటే బిల్లులు అందించనున్నట్టు ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, హౌసింగ్ ఏఈ సీహెచ్. కృష్ణారావు చెప్పారు. మండలంలోని సీతగుంట పంచాయతీ పెదబయలు గ్రామంలో గ్రౌండింగ్ మేళా నిర్వహించారు. మండలంలో పీఎం జన్‌మన్ పథకంలో 3,224 మంది లబ్ధిదారులకు గాను 2,465 గృహాలు గ్రౌండింగ్ జరిగిందని మరో 770 గృహాలు గ్రౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. దీనికి సంబంధించి లబ్ధిదారులకు అవగాహన కల్పించినట్టు చెప్పారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మోక్షమెన్నడో!



దొరగూడలో నిరుపయోగంగా సోలార్ విద్యుత్ పథకం

- ఏజెన్సీ గ్రామాల్లో నిలిచిన సోలార్ విద్యుత్ సరఫరా
- గిరిజనులకు తప్పని అవస్థలు
- అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా సోలార్ విద్యుత్ పథకాలు



జర్రెలపోదోర్‌లో నిరుపయోగంగా ఉన్న సోలార్ విద్యుత్ యూనిట్

ముంచంగిపుట్టు: కొండ శిఖర గిరిజన గ్రామాల్లో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ పథకాలు పని చేయడం లేదు. విద్యుత్ సరఫరా లేని గిరిజన గ్రామాల్లో సోలార్ విద్యుత్ సౌకర్యాలను ఎనిమిదేళ్ల కిందట అధికారులు ఏర్పాటు చేశారు. సౌర విద్యుత్ ద్వారా గిరిజనులకు విద్యుత్ సమస్య లేకుండా నిత్యం వెలుగులతో గిరిజన గ్రామాలు ప్రకాశించేవి. ముంచంగిపుట్టు మండలంలోని మారుమూల రంగబయలు, లక్ష్మీపురం, బుంగాపుట్టు, సుజనకోట పంచాయతీల పరిధిలోని మల్లేపోదోర్, జోడిగుమ్మ, పట్నపడాల్‌పుట్టు, కోసంపుట్టు, బుడ్డపనస, రంగబయలు, దొరగూడ, వనుగుపుట్టు, తాల్లబుతోట, పులాజామ్మ, జర్రెల పోదోర్ గ్రామాల్లో సోలార్ విద్యుత్ పథకాలు ఉన్నాయి. గతంలో విద్యుత్ లైన్లు లేకపోవడంతో అధికారులు కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని ఆయా గ్రామాలకు కల్పించారు. ఈ సోలార్ విద్యుత్ గత కొన్ని నెలలుగా నిలిచిపోయింది.ఆయా గ్రామాలకు విద్యుత్ సౌకర్యాన్ని విద్యుత్ శాఖ అధికారులు కల్పించారు. విద్యుత్ సరఫరా అవుతుంది. దీంతో సోలార్ విద్యుత్‌ను ఏర్పాటు చేసిన స్వచ్ఛంధ సంస్థల అధికారులు సోలార్ విద్యుత్ సరఫరాను ఆయా గ్రామాలకు నిలిపి వేశారు. సోలార్ ద్వారా చార్జింగ్ అయ్యే బ్యాటరీలు వంటి సామగ్రి తరలించారు. ఐదేళ్ల దాటితే సోలార్ విద్యుత్ పని చేయదని, ఆయా గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడంతో సోలార్ విద్యుత్ పథకాలను తొలగించాలని ఆయా స్వచ్ఛంద సంస్థ సభ్యులు గిరిజనులకు తెలియజేసి



మూలకు చేరిన సోలార్ ప్యానల్స్

సోలార్ విద్యుత్ సరఫరా జరగకుండా చేశారు. మారుమూల గిరిజన గ్రామాల్లో వర్షకాలంలో ఈదురు గాలులతో విద్యుత్ స్తంభాలు పడిపోయిన, చెట్లు పడి విద్యుత్ వైర్లు తెగిపోయిన సమయాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది. ఈ పరిస్థితుల్లో అటు విద్యుత్ సరఫరా లేక, ఇటు సోలార్ విద్యుత్ పని చేయక రాత్రిపూట ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.అధకారంలో ఉండాల్సి వస్తుంది.నీటి పథకాలు సైతం పని చేయడం లేదు.ఆ సమయాల్లో సోలార్ విద్యుత్ పని చేస్తే తమకు మాకు విద్యుత్ సమస్య లేకుండా ఉంటుందని, ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ఉన్న సోలార్ విద్యుత్ పథకాలు పని చేసే విధంగా చర్యలు తీసుకుంటే ఎంతో ఉపయోగం పడుతుందని శివారు గ్రామల గిరిజనులు కోరుతున్నారు.

నిలిచిన సరఫరా



గతంలో ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ పథకం ద్వార విద్యుత్ సరఫరాను నిలిపి వేశారు.సోలార్ విద్యుత్ పథకం పనిచేస్తే విద్యుత్ లేని సమయాల్లో ఎంతో ఉపయోగంగా ఉంటుంది.ముఖ్యంగా వర్ష కాలంలో సోలార్ విద్యుత్ వల్ల విద్యుత సమస్య లేకుండా ఉంటుంది.స్తంభాలు పడిపోయి,విద్యుత్ వైర్లు తెగిపోయిన సందర్భాల్లో అంధకారంలో ఉండాల్సి వస్తుంది.కొండ, అటవీ ప్రాంతానికి దగ్గరగా గ్రామం ఉండడంతో విష సర్పాలు, జంతువులతో భయంగా ఉండాల్సి వస్తుంది. నిబంధనలు పక్కన పెట్టి సోలార్ విద్యుత్ పథకం పని చేసేలా చర్యలు తీసుకోవాలి.

–కళ్యాణం, జర్రెలపోదోర్ గ్రామం, రంగబయలు పంచాయతీ, ముంచంగిపుట్టు మండలం

అధికారులు స్పందించాలి



రంగబయలు పంచాయితీల్లో గ్రామాల్లో సోలార్ విద్యుత్ పథకాలను గతంలో అధికారులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం మల్లె పోదోర్, కోసంపుట్టు గ్రామాల్లో సోలార్ విద్యుత్ మరమ్మతుకు గురై ఉన్నాయి. నాలుగు గ్రామాల్లో సోలార్ విద్యుత్ పథకాల సరఫరాను అధికారులు నిలిపివేశారు.ఆరు గ్రామాల్లో సోలార్ విద్యుత్ పథకాలు పనిచేస్తే విద్యుత్ అంతరాయం ఏర్పడే సమయాల్లో చీకట్లో ఉండకుండా ఉపయోగపడుతుంది.అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ఎస్.భాగ్యవతి, వైస్ ఎంపీపీ,ముంచంగిపుట్టు.

విద్యార్థుల బయోమెట్రిక్ నమోదుకు తప్పని పాట్లు



కుసుమరాయి సెంటర్ వద్ద విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ నమోదు

గంగవరం : మండలంలోని వివిధ గ్రామాల్లో సెల్ నెట్‌వర్క్ సమస్య చాలా ఇబ్బందులను తెచ్చిపెడుతోంది. మండలంలోని చాలా గ్రామాల్లో సెల్ సిగ్నల్స్ లేక ఆన్‌లైన్ సేవలకు తీవ్ర అంతరాయం, సమయాభావం పడుతోంది. ముఖ్యంగా పాఠశాలల్లో అభ్యసించే విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ నమోదుకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. చాలా గ్రామాలకు పాఠశాలలకు సమీపంలో సెల్ నెట్‌వర్క్ సిగ్నల్స్ లేని కారణంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర అసౌకర్యానికి గురువుతున్నారు. కొన్ని గ్రామాల్లో పాఠశాలల నుంచి పిల్లలను విద్యార్థుల ఆధార్ బయోమెట్రిక్ నమోదు కోసం కిలోమీటర్ల దూరం తీసుకువెళ్లి నమోదు చేస్తున్నారు. దీనికి తోడు నమోదు సమయంలో నెట్ వర్క్ ఇబ్బంది పడితే ఒకో విద్యార్థికి చాలా సమయం పడుతోంది. దీంతో ఉపాధ్యాయులు నానాపాట్లు పడుతున్నారు. బుధవారం కొమరవరం ఎంపీపీ పాఠశాల చెందిన విద్యార్థులను కోమరవరం పాఠశాలకు సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న కుసుమరాయి సెంటర్ వద్దకు తీసుకువచ్చి ఆధార్ బయోమెట్రిక్ నమోదు చేయించారు. దీని వల్ల స్కూల్ పిల్లలు, ఉపాధ్యాయులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటకైనా ఉన్నతాధికారులు స్పందించి కొమరవరం గ్రామానికి రహదారి, సెల్ టవర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరతున్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి



తహసీల్దార్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ సంక్షేమ సంఘం సభ్యులు

రాజవొమ్మంగి: కోర్టు ఉత్తర్వుల మేరకు ప్రధాన రహదారికి ఇరువైపులా గల అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని ఆదివాసీ సంక్షేమ సంఘం బృందం డిమాండ్ చేసింది. అధికారులు కేవలం భవనాలకు మార్కింగ్ ఇచ్చి కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఈ మేరకు బుధవారం సంఘం సభ్యులు కుంజ శ్రీనివాస్ తదితరులు రాజవొమ్మంగిలో పర్యటించారు. రహదారిపై గల మార్కింగ్‌లను పరిశీలించారు.అనంతరం తహసీల్దార్ అల్లు సత్యనారాయణను కలసి వినతిపత్రాన్ని అందజేసారు. ఈ విషయంలో రంపచోడవరం సబ్ కలెక్టర్ చొరవ చూపి ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. చర్యలు తీసుకోకపోతే రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయాన్ని చుట్టుముట్టి ఆందోళనకు దిగుతామన్నారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బాబూరావు, సభ్యులు నూకరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలు మంజూరు చేయాలి



నిరసన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

హుకుంపేట: స్థానిక గిరిజన సంక్షేమ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో వసతి సమస్యతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వసతి గృహాలను ప్రభుత్వం మంజురు చేయాలని వైస్ ఎంపీపీ సుడిపల్లి కొండలరావు, పాఠశాల కమిటీ చైర్మెన్ రేగం ఈశ్వరమ్మ, విద్యార్థులు తల్లిదండ్రులు కోరారు. పాఠశాలలో సరైన వసతి లేక తమపిల్లలు ఎదుర్కొంటున్న సమస్యపై విద్యార్థుల తల్లిదండ్రులు బడి వద్ద బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పాఠశాలలో సుమారు 300 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారని, పాఠశాల ఏర్పాటు చేసి పదేళ్లు కావస్తున్నా సొంత వసతి గృహాలు లేవన్నారు. గత్యంతరం లేక తమ పిల్లలు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సంబంధించిన వసతి గృహాల్లో ఉంటున్నారని చెప్పారు. ఇక్కడ కనీసం పడుకోవడానికి కూడా అవకాశం లేదని, మరుగుదొడ్ల పరిస్థితి మరింత దారుణంగా ఉందని, దీంతో తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. పాఠశాల కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



మాట్లాడుతున్న జెడ్పీటీసీ బాలయ్య పడాల్, సర్పంచ్ పుష్పలత, డీఈ కరుణ

చింతపల్లి: మండల కేంద్రంలోని సాయినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్యపడాల్, సర్పంచ్ దురియా పుష్పలతలు తెలిపారు. వారు బుధవారం సాయినగర్ వాసులతో సమావేశమయ్యారు. గడిచిన కొన్ని నెలలుగా ఈ ప్రాంత వాసులు తాగునీటికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పంచాయతీ నుంచి ఎన్ని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో ఈ సమస్యను సర్పంచ్ పుష్పలత, జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్యపడాల్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సమస్యను జిల్లా పరిషత్ దృష్టికి తీసుకువెళ్లి రూ.10 లక్షలు నిధులు మంజూరు చేయించారు. ఆయా నిధులతో సాయినగర్‌లో తాగునీటి సమస్య పరిష్కారానికి చేపట్టే కార్యక్రమంపై తాగునీటి సరఫరా విభాగ డీఈ కరుణ, ఏఇ హేమలతతో కలసి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు వీధుల్లో అక్రమ కనక్షన్‌లను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మంజూరైన నిధులతో సాధ్యమైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేసి తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జల్లి సుధాకర్, మండల పార్టీ అధ్యక్షుడు పాంగి గణబాబు, నాయకులు గంగన్నపడాల్, కోటి, శ్రీను, రాజు తదితరులు పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో లక్ష్మీదేవి అమ్మవారు



దేవరాపల్లి : దేవరాపల్లిలోని శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారు బుధవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఏటా ఆషాడమాసంలో వచ్చే మాస శివరాత్రిని పురస్కరించుకొని అమావాస్య ముందు రోజు శాకంబరి అలంకరణలో లక్ష్మీదేవిగా దర్శనమిస్తారని స్థానిక ఆలయ అర్చకులు చంద్రమౌళి గిరి నాగేశ్వరరావు శర్మ తెలిపారు. ఈ నేపథ్యంలోనే లక్ష్మీదేవి అమ్మవారిని వివిధ రకాల కాయగూరలతో శాకంబరిగా భక్తులు అలంకరించారు. లక్ష్మీ అష్టోత్తర, సహస్ర నామాలతో అధిక సంఖ్యలో హాజరైన భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు జరిపారు.

తప్పిన అగ్నిప్రమాదం



దుకాణం వద్ద వ్యాపించిన మంటలు

అనకాపల్లి: స్థానిక రింగ్‌రోడ్డు ఎన్టీఆర్ బెల్లంమార్కెట్ యార్డు దుకాణాల వద్ద గల చెత్తకు గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం నిప్పుపెట్టారు. మంటలు ఒక్కసారిగా ఎగిసిపడడంతో మార్నింగ్ వాక్ చేస్తున్నవారు గుర్తించి, నాలుగు బైక్‌లు, రెండు కార్లను పక్కకు లాగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు.

వెంకన్న ఆలయ నిర్మాణానికి విరాళం

మునగపాక: మునగపాక బైపాస్ రోడ్డులో తలపెట్టిన వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. బుధవారం మునగపాకకు చెందిన పెంటకోట పరదేశినాయుడు, మాణిక్యం దంపతుల జ్ఞాపకార్థం కుమారులు ఓం శ్రీను, ఆనంద రామకృష్ణ రూ.25 వేల నగుదును విరాళంగా అందజేశారు.

కమిటీ సభ్యులు దాడి ముసిలినాయుడు, ఆడారి కాశీబాబు, బొడ్డేడ రామునాయుడు, జల్లేపల్లి కిష్టప్ప, వెలగా రామకృష్ణ, ఆడారి సత్యనారాయణ, పెంటకోట సారథి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



దుచ్చరపాలెంలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ ఏడీ తిరుమలరావు

గూడెం కొత్తవీధి: గిరి రైతులు వ్యవసాయ పంటలలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.వి.తిరుమలరావు అన్నారు. రింతాడ పంచాయతీ పరిధిలోని దుచ్చరపాలెం గ్రామంలో చింతపల్లి పరిశోధన స్థానం శాస్త్రవేత్త బయ్యపురెడ్డితో కలసి బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విధిగా పంట బీమా చేయించుకోవాలన్నారు. వరి, రాగి, మొక్కజొన్న, పసుపు పంటలకు మీ సేవా కేంద్రాలు ద్వారా ప్రీమీయం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు.

వరి పంటకు ఆగస్టు 15 వరకూ గడువు ఉందని మిగిలిన పంటలకు ఈ నెలాఖరుకు వరకు మాత్రమే గడువు ఉందన్నారు. ఇన్‌చార్జి ఏఓ మధుసూదనరావు, వీహెచ్ఎ సింహాచలం తదితరలు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్



మట్టపల్లిలో సర్పంచ్ రామారావుతో గ్రామస్తులు



గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న గిరిజన, రైతు సంఘం నాయకులు

వి.ఆర్.పురం: జాతీయ ఉపాధి హామీ కూలీల వేతనాలు తొమ్మిది నెలలుగా అందడం లేదని చిన్న మట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కోటం జయరాజు దృష్టికి గ్రామస్తులు బుధవారం తీసుకెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉపాధి వేతనాలు సుమారు 9 వారాల నుంచి అందడం లేదన్నారు. చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధలోని తుష్టివారిగూడెం, పత్తిపాక, గుండుగూడెం, చింతరేవుపల్లి, కన్నయగూడెం, చిన్న మట్టపల్లి, వెంకపాలెం గ్రామాలకు చెందిన ఉపాధి కూలీలకు తక్షణమే వేతనాలు చెల్లించాలన్నారు. నెలల తరబడి కూలీలు అనేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధి వేతనాలు చెల్లించాలని లేనిపక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రామారావు, సత్యనారాయణ , కరుణాకర్, దుర్గారావు, శంకర్, వీరయ్య, గణేష్, బాలకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

గంగవరం : ఉపాధి హామీ పథకం పనుల కూలీలకు వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని , పనులను 200 రోజులకు పెంచాలని, రోజు కూలీ వేతనం రూ.600లకు పెంచాలని, ఉపాధి పనుల్లో అవకతవకలపై విచారణ చేయాలని డిమాండ్ చేస్తూ ఏజెన్సీ గిరిజన సంఘం, ఏపీ, రైతుకూలీ సంఘం ఆధ్వర్యంలో గంగవరంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండ మొదలు సర్పంచ్ , ఏజెన్సీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షరాలు వేట్ల విజయ, రైతు కూలీ సంఘం తూర్పుగోదావరి జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు నాయకత్వంలో వై.జంక్షన్‌లో ఎర్ర జెండాలతో ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కొండమొదలు సర్పంచ్ వేట్ల విజయ, రైతుకూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్ నుంచ ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లించడం లేదని, పనుల్లో జరుగుతున్న అవినీతిపై విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవో కార్యాలయంలో ఏవోకి అందచేశారు. నాయకులు సత్యనారాయణ, బుల్లబ్బాయ్, శ్రీరాములు, పీసా కమిటీ మండల కార్యదర్శి రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం



జి.మాడుగులలో తహసీల్దార్ రాజ్‌కుమార్‌ను సన్మానిస్తున్న సర్పంచ్‌లు



అడ్డతీగలలో హెచ్ఎం వరప్రసాద్, టీచర్లను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

జి.మాడుగుల: మండల తహసీల్దార్ జి.రాజ్‌కుమార్‌ను బుధవారం మండల సర్పంచ్‌ల ఫోరం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి, ఆయనకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రెవెన్యూ సేవలను విస్తృతం చేయాలని సర్పంచ్‌లు కోరారు. ఇందులో భాగంగా వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, నాయకులు తదతరులు తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు బొకే అందించి, శాలువ కప్పి సత్కరించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు కిముడు రాంబాబు, సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు, సీదరి కొండబాబు, శివనారాయణ, గంగరాజు, సింహాచలం, కొండబాబు, నాయకులు సోమలింగం, బాంగారాజు, బాలన్న తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులకు సన్మానం

అడ్డతీగల : స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ప్రధానోపాధ్యాయుడు కె.వరప్రసాద్, ఉపాధ్యాయులు సత్యనారాయణ, కుక్ కాంతమ్మలను ఘనంగా సన్మానించారు. ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ఆనందబాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు వారికి ఘనంగా వీడ్కోలు పలికారు. హెచ్ఎం వరప్రసాద్, ఉపాధ్యాయుడు సత్యనారాయణ సేవలను ఉపాధ్యాయులు సుందరరావు, శర్మ, అరుణ్‌కుమార్, అశోక్, జగ్గారావు కొనియడారు. పూలమాలు, దుశ్శాలువాతో సత్కరించారు.

రైతులకు సూచనలు

రావికమతం : ఆరోగ్యకరమైన నారుమడికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి రమేష్‌బాబు సూచించారు. పొలం పిలుస్తోందిలో భాగంగా మండలంలో దొండపూడి గ్రామంలో బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. వ్యవసాయ సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కలిసి వరి నారుమడులను పరిశీలించారు. వరి నారుమడి సంరక్షణ, నాట్లు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఏవో వివరించారు. రైతు సేవా కేంద్రాల్లో రైతులతో సమావేశమై ఖరీఫ్ సాగులో పాటించాల్సిన మెలకువలు, తగిన మోతాదులో యూరియా వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దొండపూడి వ్యవసాయ సహాయకురాలు భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కె.కోటపాడు : రైతులు వరినాట్లును వేసే సమయాల్లో నారు చివర్లను తుంచి నాట్లు వేయాలని రైతులకు అనకాపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ ఆదిలక్ష్మి తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో బాగంగా బుధవారం చౌడువాడలో గల రైతులకు నాట్లు వేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. నారు చివర్లు తుంచి నాట్లు వేయడం వలన కాండపు తొలిచే పురుగు రాకుండా అరికట్టవచ్చునని వివరించారు. దమ్ము సమయంలో ఎకరాకు 50 కిలోల డీఏపీ, 10 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు. పొలం గట్లపై కలుపు లేకుండా చూసుకోవాలని, యూరియా వినియోగం తగ్గించడం ద్వారా పంట తెగుళ్ల బారిన పడకుండా చర్యలను తీసుకోవచ్చునని డాక్టర్ ఉమామహేశ్వరరావు అన్నారు. కౌలు రైతులకు కార్డుల కోసం గ్రామాల్లో గల వీఆర్వోలను సంప్రదించాలన్నారు. ఏవో సోమశేఖర్, ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ వి.చంద్రశేఖర్, తనకల అప్పలనాయుడు, బంటు శ్రీను, వీఏఏ రామునాయుడు పాల్గొన్నారు.

వాణిజ్య పంటల సాగుతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారి మురళీకృష్ణ

ముంచంగిపుట్టు: ప్రత్యామ్నాయ వాణిజ్య పంటల సాగులతో గిరిజన రైతులకు ఆర్థిక లబ్ధిచేకూరుతుందని మండల వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ అన్నారు.మండలంలోని దారెల పంచాయతీ కేంద్రంతో పాటు పేటమాలిపుట్టు, డి.కుమ్మరిపుట్టు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. లాభాలు వచ్చే పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. గంజాయి సాగు వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ మాట్లాడుతూ గిరిజన రైతులు అధిక ఆదాయాన్ని ఇచ్చే సిల్వర్ ఓక్, కాఫీ, మిరియాలు, జీడిమామిడి, అరటి వంటిని ప్రత్యామ్నాయ పంటలుగా వేయాలని సూచించారు. గంజాయి సాగు చట్టరీత్యా నేరమని వాటికి దూరంగా ఉండాలన్నారు. సర్పంచ్ పాండు, ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఎస్.రాయవరం: వేమగిరి శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ విభీషణరావు బుధవారం తెలిపారు. గ్రామం సమీపంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేశామన్నారు. ఈ దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.2,650 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమెదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.